క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: మరమ్మతుల కారణంగా తల్వేద సబ్‌స్టేషన్ పరిధిలోని మంజులాపూర్ టౌన్ 11కేవీ, అగ్రికల్చర్ లైన్లలో మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భూదాతకు సన్మానం



పోశెట్టిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో ఉన్న రంగపేట రాజరాజేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చిన గ్రామానికే చెందిన దాతను సోమవారం గ్రామస్తులు సన్మానించారు. మోటపలుకుల పోశెట్టి అనే యువకుడు గుంట పావు భూమిని ఆలయానికి విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. మరో యువకుడు మోటపలుకుల శంకర్ పావు గుంట భూమిని ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నందుకు వారిని అభినందించారు.

కొండగట్టుకు స్వాములు



కొండగట్టుకు వెళ్తున్న దీక్షాపరులు

భైంసాటౌన్: పట్టణానికి చెందిన హనుమాన్ దీక్షాపరులు సోమవారం మాల విరమణకు జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు తరలివెళ్లారు. హనుమాన్ దీక్ష సేవాసమితి కిసాన్‌గల్లి గురుస్వామి కోర్వ చిన్నన్న ఆధ్వర్యంలో పలువురు స్వాములు వాహనాల్లో వెళ్లారు.

అందుబాటులో విత్తనాలు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి), ఆలూరు పీఏసీఎస్‌ల పరిధిలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి విత్తనాలు ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తామని పేర్కొన్నారు. 30కిలోల విత్తనాల బస్తా రాయితీపై రూ.1,116కే అందిస్తున్నామన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్సులతో విక్రయ కేంద్రాలకు వచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



విత్తనాలు అందిస్తున్న ఏఈవోలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఉపకేంద్రంలో సోమవారం రైతులకు జీలుగ విత్తనాల సంచులను ఏఈవోలు భాగ్యలక్ష్మి, రమ్య పంపిణీ చేశారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఒక్క జీలుగు బస్తా ధర రూ.1,116 ఉంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆవాసంలో దుస్తులు అందజేత

భైంసాటౌన్: నిర్మల్‌కు చెందిన సాయారెడ్డి-సంధ్య దంపతులు తమ కూతురు చాత్విక రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం భైంసాలోని వివేకానంద అనాథ పిల్లల ఆశ్రమంలో నిర్వహించారు. ఈసందర్భంగా అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం 30 మంది ఆవాసం విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఆవాస్ ప్రముఖ్ లింగారెడ్డి ఉన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు



బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్‌రెడ్డి

మామడ: మండలంలోని పొన్కల్‌లో గ్రామాభివృద్ధి కమిటీతోపాటు పలు ఆలయాలకు నూతన కమిటీ సభ్యులను సోమవారం ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయం కమిటీ చైర్మన్‌గా ఇప్ప రవీందర్‌రెడ్డి, నాగదేవతాలయం కమిటీ చైర్మన్‌గా కాలగిరి గంగయ్య, దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్‌గా మల్యాల లింగన్న బాధ్యతలు స్వీకరించారు. ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన ఒడ్నం మోహన్ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట దశరథ రాజేశ్వర్, రాజ్‌మహ్మద్, పలువురు నాయకులు ఉన్నారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు
- తప్పుల సవరణకు భైంసా, నిర్మల్ ప్రాంతాలకు వెళ్తున్న జనం
- నర్సాపూర్(జి)లో కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆధార్ కోసం ఏర్పాటు చేసిన షెడ్డు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఆధార్ సేవల కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి అంశం ఆధార్‌తో ముడిపడి ఉంటుంది. సంక్షేమ పథకాలు, పంట విక్రయాలకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఆధార్‌కు సెల్ నంబర్ లింక్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుంది. ఆధార్‌లో చిరునామా మార్పునకు, చిన్నారులకు కొత్తగా ఆధార్ తీసుకునేందుకు, వేలిముద్రలు రాకున్నా.. ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు తీయాల్సిందే. కానీ నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్తున్నారు.

దీంతో సమయం వృథా కావడంతోపాటు ఆర్థికంగాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల కిందట మండలానికి ఆధార్ సేవ కేంద్రం మంజూరవడంతో నర్సాపూర్(జి) తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వాహకుడు రూ.3 లక్షలు వెచ్చించి షెడ్డు, కంప్యూటర్, ఫర్నీచర్, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. కానీ సంబంధిత శాఖ అధికారులు కోర్టులో కేసు ఉన్న కారణంగా కేంద్రం ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వలేదు.

దీంతో మండల ప్రజలు ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డుల కోసం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. గతంలో కమిషన్ ఆధారంగా ఆధార్ కేంద్రాలు నిర్వహించేవారు. ప్రస్తుతం నిబంధనలు మార్చడంతో ఆధార్ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతుందని నిర్వాహకులు వాపోతున్నారు.

ఐదు మండలాల్లో ఇదే పరిస్థితి..

జిల్లాలో ఒక్క సోన్ మండలం మినహా నిర్మల్‌గ్రామీణం, పెంబి, దస్తూరాబాద్, బాసర, నర్సాపూర్(జి) వంటి ఐదు మండలాల్లో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సమస్యలతో ఆధార్ కేంద్రం ఏర్పాటు విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. కేసును త్వరగా పూర్తి చేసి ఆధార్ సేవా కేంద్రాలు మొదలయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోర్టులో కేసు నడుస్తోంది

నర్సాపూర్(జి)లో ఆధార్ కేంద్రం ఏర్పాటు విషయమై కోర్టులో కేసు నడుస్తుంది. కేసు పూర్తయిన అనంతరం ఆధార్ సేవ కేంద్రం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– శ్రీనివాస్, తహసీల్దార్, నర్సాపూర్ (జి)

త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలి



నర్సాపూర్‌లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుకు అధికారులు, పాలకులు స్పందించాలి. ఆధార్‌లో ఏయే చిన్న అంశం మార్చాలన్నా.. నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. – బర్కుంట నరేందర్, నర్సాపూర్(జి)

కేంద్రం ప్రారంభించాలి



మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక అవస్థలు పడుతున్నాం. ఆధార్‌లో చిన్న మార్పులకైనా నిర్మల్ వెళ్లాల్సి వస్తుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఆధార్ కేంద్రం ప్రారంభించాలి.

– కోడె సుధాకర్, నర్సాపూర్(జి)

పారితోషికం చెల్లించాలని బీఎల్‌వోల వినతి



ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీఎల్‌వోలు

ఖానాపూర్/కడెం: ఎన్నికల విధులు నిర్వహించిన తమకు పారితోషికం చెల్లించి తమ సమస్యలు పరిష్కరించాలని బీఎల్‌వోలు కోరారు. సోమవారం ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల బీఎల్‌వోలు తమ సమస్యలపై ఉట్నూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో భీంరావుకు వినతిపత్రం అందజేశారు. నూతన జీవో ప్రకారం పారితోషికం, ఎన్నికల సమావేశాలకు వచ్చిన బీఎల్‌వోలకు టీఏ, డీఏలు చెల్లించాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఎల్‌వోల సంఘం జిల్లా నాయకులు గుడిసె సంపూర్ణ, విజయనిర్మల, మంగమ్మ, వరలక్ష్మి, సుకన్య, సత్య, రాజేశ్వరి, జన్ను, వైష్ణవి, మంజుల, తదితరులు ఉన్నారు.

అధ్వానంగా పల్లె రోడ్లు



సేవాలాల్‌తండా నుంచి నర్సింహనగర్ తండాకు వెళ్లే మార్గంలో తేలిన కంకర

- కంకరతేలి, గుంతలు ఏర్పడిన వైనం
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. సేవాలాల్‌తండా నుంచి నర్సింహనగర్‌తండా, కన్కపూర్-ఆష్టా రోడ్లు కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం..

రాయపూర్‌కాండ్లీ నుంచి ఎడ్‌బిడ్, కన్కపూర్-ఆష్టా రోడ్డుపై నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు ఈ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వర్షాకాలంలో రోడ్డుపై వరద నిలుస్తుండటంతో చోదకులు ఓ గుంతను తప్పించే యత్నంలో మరో గుంతలో పడుతున్నారు. తారు రోడ్లు వేసి 15 ఏళ్లు దాటినా మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ఈ మార్గంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నట్లు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు..

సేవాలాల్‌తండా నుంచి నర్సింహనగర్‌తండా, కన్కపూర్-ఆష్టా రోడ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులు, పాలకులను కోరినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు వెళ్తుండటంతో త్వరగా ధ్వంసమవుతున్నాయి.

మరమ్మతులు చేపట్టాలి



సేవాలాల్‌తండా నుంచి రాయపూర్‌కాండ్లీ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే భయమేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. వర్షాకాలంలో గుంతలతో వాహనదారులు గోస పడుతున్నారు.

– సదానందం,రాయపూర్‌కాండ్లీ

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని సేవాలాల్‌తండా-నర్సింహనగర్‌తండా, కన్కపూర్-ఆష్టా రోడ్లపై గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే. ఈ రోడ్ల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రఘువంశీ, పీఆర్ జేఈ, లోకేశ్వరం


కారును ఢీకొన్న బైక్.. ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ యువకుడు

ముధోల్: కారును బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తరోడా వద్ద చోటు చేసుకుంది. కుభీర్ మండలంలోని గొడిసెర గ్రామానికి చెందిన తిరుపతి, బాలాజీ సోమవారం ద్విచక్ర వాహనంపై ముధోల్‌కు వెళ్లారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో గొడిసెరకు వెళ్తుండగా తరోడా-భైంసా రహదారిపై ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

త్యాగశీలి రమాబాయి అంబేద్కర్



నివాళులర్పిస్తున్న బౌద్ధఉపాసకులు

భైంసాటౌన్: అంబేద్కర్ చేసిన పోరాటంలో వెంట ఉండి వారికి సహకరించిన త్యాగశీలి రమాబాయి అంబేద్కర్ అని బీఎస్‌ఐ అధ్యక్షులు, బౌద్ధాచార్యులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. సోమవారం పట్టణంలోని ఏపీనగర్, రాహుల్‌నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. బీఎస్‌ఐ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దమ్మానంద్ దేవ్కే, సాగర్ బాయి జంగ్మే, సంగీత వాగ్మారే, ఏక్‌నాథ్ బిరదే, బౌద్ధ ఉపాసకులు, దమ్మ అభిమానులు ఉన్నారు.

రైతులకు నష్టం చేస్తున్నారని ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు

ఖానాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా ధాన్యం తూకంలో కోతలు విధిస్తూ రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోసంపల్లె, గోడలపంప, పాతఎల్లాపూర్ గ్రామాల రైతులు నిర్మల్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. భైంసాలోని ఓ రైస్‌మిల్లులో రైతులు విక్రయించిన ధాన్యం నుంచి ఇష్టారాజ్యంగా విధిస్తున్న కోతలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు ఐదు కిలోలు కోత విధిస్తూ.. తూకం వేసిన ధాన్యానికి సంబంధించిన రసీదులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అల్లెపు పీటర్, కరిపె ప్రకాశ్, డి.కుమార్, ఈసారపు నవీన్, లక్ష్మీరాజు ఉన్నారు.

గ్రామాల్లో శుభ్రత పాటించాలి



మహలింగిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో

తానూరు: ఎప్పటికప్పుడు మురికి కాల్వలను శుభ్రం చేస్తూ.. గ్రామాల్లో శుభ్రత పాటించాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని మహలింగి, బామ్ని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. మహలింగిలో పల్లె ప్రకృతివనం పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

‘గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి’



ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భైంసాటౌన్: గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని గోసేవ, గోసంరక్షణ, హిందూ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బక్రీద్ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలని కోరారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గోసేవా ప్రముఖ్ కె.నారాయణ, విభాగ్ టోలీ సభ్యులు నూకల సురేశ్, భైంసా నగర ప్రముఖ్ సాయినాథ్, వీహెచ్‌పీ నగర ప్రముఖ్ పెరుగు నవీన్, ధర్మ జాగరణ నగర ప్రముఖ్ శంకర్, బీజేపీ నాయకులు తాడేవార్ సాయినాథ్, భజరంగ్‌దళ్ ప్రముఖ్ రాందాస్, దత్తు ఉన్నారు.

బ్లడ్ బ్యాంకులకు నోటీసులు అందజేత



ఆసుపత్రిలో నోటీసు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ దేవిదాస్

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ ఆసుపత్రులు, బ్లడ్ బ్యాంక్, మెడికల్ షాప్ యజమానులు బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు ఇవ్వవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఆసుపత్రులు, బ్లడ్ బ్యాంకులకు ఆయన నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సముదాయాల నుండి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. నిబంధనలు పాటించకుంటే బయో మెడికల్ మేనేజ్‌మెంట్ చట్టం 2000 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



సుర్జాపూర్‌లో పోషకాహారం ఇస్తున్న శ్రీలత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, గంగాయిపేట్, సుర్జాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ శ్రీలత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు శుభ్రమైన వంటపాత్రల్లో పోషకాహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉన్నారు.



కడెం: లంబడితండాలో పరిశీలిస్తున్న రాధ

కడెం: మండలంలోని ఉడుంపూర్ లంబడితండా, ఇస్లాంపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

రహదారి ఆక్రమణపై చర్యలకు ఫిర్యాదు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామం పెద్దూర్ బస్టాండ్ నుంచి కరిసెల గుట్టకు వెళ్లే రహదారిని సమీప రైతులు ఆక్రమించుకున్నారని సోమవారం తహసీల్దార్ శ్రీదేవికి వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇరువైపులా పొలాలు కలిగిన కొందరు రైతులు రహదారిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని.. వెంటనే ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు. స్పందించిన తహసీల్దార్ నాలుగు రోజుల్లో సర్వేయర్ ద్వారా రహదారి సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

‘రైతులు, కూలీల సమస్యలు పరిష్కరించాలి’



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైనందున.. రైతులకు నాసిరకం విత్తనాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం హామీని నెరవేర్చాలని కోరారు. రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.7500 అందించాలన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేసి తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధర చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధి కూలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.పద్మ, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుంచుల నారాయణ, చందుల సాయికిరణ్, నవీన్‌కుమార్, జాదవ్ కిషన్, రైతులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేపట్టరూ..



తానూరు: తానూరు-భైంసా రోడ్డు నుంచి ఉమ్రి(కే) గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన వద్ద గతేడాది వర్షాలకు రోడ్డు ఇరువైపులా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు తరచుగా ఇక్కడ కింద పడుతూ గాయాలపాలవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి.. సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623